తేది: 22 జనవరి, 2018

ప్రచురణార్థం/ ప్రసారార్థం :

పెదగొట్టిపాడులో దళితులపై దాడి చేసిన
నేరస్తులను అరెస్టు చేయాలి
న్యాయం చేయడంలో ప్రభుత్వం విఫలం
సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు మధు, రామకృష్ణ
24న చలో పెదగొట్టిపాడు నిర్వహించి తీరుతాం
గాయపడిన ఇద్దరు దళితుల పరిస్థితి విషమం

పెదగొట్టిపాడు దళితులపై దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని, నిందితులపై ఎస్‌సి, ఎస్‌టి ఎట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు పి.మధు, కె.రామకృష్ణ తెలిపారు. సోమవారం సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జల్లి విల్సన్‌తో కలిసి మాట్లాడారు. జనవరి ఒకటోతేదీన దళితులపై పెత్తందారులు దాడిచేశారని, అప్పటి నుండి ఇప్పటి వరకూ సాంఘిక బహిష్కరణ అమలు జరుగుతోందని తెలిపారు. దళిత యువకులు విద్యుత్, సైకిల్‌షాపులు నిర్వహించేందుకు ఇచ్చిన షాపులను వెనక్కు తీసుకుంటున్నారని, కౌలు పొలాలు ఇవ్వబోమని చెప్పారని, గతంలో తీసుకున్న అప్పులను వెంనటే చెల్లించాల్సిందిగా ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. అలాగే దాడిలో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారని, వారిలో ఇద్దరి పరిస్థితి ఇప్పటికీ విషమంగా ఉందని తెలిపారు. గాయపడిన వారిలో ఒకరికి కాలు తొలగించాలని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు చెబుతున్నారన్నారు. అయినా దాడిచేసిన వారిపై ఇప్పటికీ ఎస్‌సి, ఎస్‌టి ఎట్రాసిటీ చట్ట కింద కేసులు నమోదు చేయలేదని, ప్రభుత్వమే వారికి రక్షణ కల్పిస్తోందని తెలిపారు. పైగా గ్రామంలో ఉన్న యువతీ, యువకులను ఆందోళనలో పాల్గంటున్నారనే పేరుతో అదుపులోకి తీసుకుంటున్నారని చెప్పారు. సుమారు 200 నుండి 300 మంది పోలీసులు గ్రామంలో ఇప్పటికీ పహారా నిర్వహిస్తున్నారని, దాడి చేసిన వారికంటే బాధితులపైనే కేసులు నమోదు చేస్తున్నారని పేర్కొన్నారు. అక్కడ ఎవరినీ నోరెత్తనీయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత సంఘాలు, వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు సంఘీభావం తెలిపేందుకు వెళితే అరెస్టులు చేస్తున్నారని, ముందస్తుగా అదుపులోకి తీసుకుంటున్నారని అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం దళితులకు వ్యతిరేకంగా ఏకపక్షంగా వ్యవహరిస్తోందని అన్నారు. గ్రామంలోకి వెళ్లిన వారికి అరెస్టు చేస్తూ పోలీసులు భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ చర్యలకు వ్యతిరేంకగా, దళితులకు సంఘీభావంగా 24వ తేదీన చలో పెదగొట్టిపాడు నిర్వహిస్తున్నామని, అడ్డుకోవాలని చూస్తే జరగబోయే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. నిర్బంధాన్ని తీవ్రం చేస్తే జాతీయస్థాయిలో నాయకత్వంతోపాటు, చుట్టుపక్కల రాష్ట్రాల నుండి దళిత, ప్రజా సంఘాల నాయకులతో కలిపి ఉద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు. దాడి జరిగిన సమయంలోనే ప్రభుత్వం స్పందించి ఉంటే సాంఘిక బహిష్కరణ జరిగేది కాదని అన్నారు. కర్నూలు జిల్లా ఆళ్ల నియోజకవర్గంలోని నక్కలదిన్నెలోనూ దళితులను సాంఘిక బహిష్కరణ చేసి వారికి చ్చిన భూముల్లో మట్టిని తవ్వేస్తున్నారని అన్నారు. గరగపర్రులో అంత పెద్దఎత్తున ఆందోళన జరిగినా అంబేద్కర్ విగ్రహాన్ని పెట్టేందుకు సిద్ధపడటం లేదని పేర్కొన్నారు. పైగా లక్షమంది దళితులను సమీకరించి సభ నిర్వహిస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. దళితుల ఆత్మగౌరవంపై ప్రభుత్వం దాడి చేస్తోందని, దీన్ని ఏ మాత్రమూ సహించేది లేదని హెచ్చరించారు. సామాజిక సంఘాలు, వ్యక్తులపైనా దాడులు జరుగుతున్నాయని తెలిపారు. దీన్ని ఏ మాత్రమూ సహించలేది లేదని హెచ్చరించారు.

= = = =